స్కెచ్

# పెళ్ళిచూపులు

కె. సరోజిని

"పాపం, కొండయ్యగారు పోయారే, అమ్మా" అని మా తమ్ముడు రామకృష్ణ చావు కబురు చల్లగా చెప్పేడు:

"ఆ సంగతి నీకెవరు చెప్పారురా నాయనా?" అడిగింది అమ్మ.

"ఎవరు చెప్పేదేంటే! వాళ్ళింట్లో ఒకటే ఏడుపులూ ఇంటినిండా జనం వున్నారు. వచ్చేవారు వస్తున్నారు. పోయేవారు పోతున్నారు!" అని జవాబు చెప్పేడు తమ్ముడు.

"అందుకనే కాబోలు నాన్న యిందాక కొండయ్యగారింట్లోకి వెళ్ళుతున్నారు" అంది మా చెల్లి.

"చచ్చిపోక ఏమౌతాడు పాపం. అసలే జబ్బుమనిషి దానికితోడు మూడవ కూతురు పెళ్ళయిన పదవరోజున యింట్లోనుంచి ఎవడితోనో చెప్పకుండా లేచిపోయిందికదా! మరి రెండవ కొడుకు అల్లరి చిల్లరిగా తిరుగుతూవున్న డబ్బంతా నాశనం చేస్తున్నాడా! ఈ సంగతులు తెలిసేగా యింతవరకూ నాలుగో అమ్మాయిని పెళ్ళిచేసుకోవడానికి ఎవరూ ముందుకురాంది. ఇవన్నీ మనసులో పెట్టుకొని దిగులుపడి మానవుడు మరణించాడు. ఇంతకూ ఆయనకు భూమిమీద గింజలు లేవు." అని సానుభూతి వెల్లడించింది నాయనమ్మ.

"ఇప్పుడంటే యిట్లా అయిపోయాడుగాని యిదివరలో ఆయన్ను మించిన లక్షాధికారి మన వూరిలో మరొకరులేదు. దానధర్మాలు చేయటంలో ఆయనకు మించిన చేయి మరొకటిలేదు. అప్పట్లో ఆయన ప్రతి శనివారం పేదలకు అన్నదానం చేసేవాడు. బీద విద్యార్థులకు చదువు చెప్పించేవాడు. స్కూళ్ళకు విరాళాలిచ్చేవాడు" అని తాతయ్య పడుకున్నవాడల్లా కూర్చుని కొండయ్యగారి కుటుంబాన్ని కొనియాడారు.

"మీరన్నమాట నిజమేనండోయ్! ఇప్పుడు కాలేజీలో లెక్చరర్ పనిచేస్తున్న సత్యంకూడా యీయన ద్వారానే పైకొచ్చాడని ఒకసారేదో మాటమీద కొండయ్యగారి కోడలు నాతో చెప్పింది" అని నాయనమ్మ తాతయ్య ప్రసంగానికి బలం చేకూర్చింది.

"ఏమండోయ్ బామ్మగారూ! ఆ సత్యంగారు మా ఎకనమిక్సు లెక్చరరుగారేనండీ!" అని పమిట సరిచేసుకుంది మా మాటలు వింటూ కూర్చున్న ఎదురింటివారి పెద్దమ్మాయి సరస్వతి.

"అయితే యిప్పుడాయన మీ కాలేజీలో పనిచేస్తున్నారన్నమాట ఇదివరలో మా కాలేజీలో పనిచేసేవారు. కాని క్లాసులో స్టూడెంట్సు ఆయన చెప్పేది వినకుండా గోలచేస్తూ ఆయన్ను ఏడిపిస్తుండేవారు. అందుకని తట్టుకోలేక మీ కాలేజీలో చేరారన్నమాట"...అని యింకా ఏమేమో చెప్పి సరస్వతి మెప్పులు పొందుదామనుకున్న శ్రీరామ్‌కు "ఒకసారి బజారు పోయిరావాలి యిటు రార్రా" అన్న వాళ్ళఅమ్మ కేక వినేటప్పటికి వెళ్ళకతప్పిందికాదు.

శ్రీరామ్ యిక్కడనుంచి ఎప్పుడు వెళ్ళిపోతాడా అని ఎదురుచూస్తున్నాడు మా రెండవ భాగంలో అద్దెకుంటున్నవారి రెండవ అబ్బాయి రావు. ఎందుచేతనంటే ఎదురింటివారమ్మాయి సరస్వతితో అతను ఎన్ని రోజులనుంచో మాట్లాడాలనుకుంటున్నాడు. కాని ఆ అవకాశం యింతవరకూ రాలేదు. అథవా వచ్చినా రావుకు ఆమెతో మాట్లాడటానికి ధైర్యం చాలటం లేదు. ఈ రోజు ఆ అవకాశం లభించింది. దాన్ని కాస్తా శ్రీరామ్ వినియోగించుకున్నాడు. సహంలో శ్రీరామ్‌ను వాళ్ళ అమ్మ పిలిచినందుకు రావు సంతోషించాడు. శ్రీరామ్ వెళ్ళిపోగానే పీడ విరగడయిపోయింది అని రావు సంతోషించాడు. సంతోషించి శ్రీరామ్ వదిలివెళ్ళిన సంగతిని తిరిగి ప్రస్తావించి సరస్వతితో మాట్లాడుతూ కాసేపు అక్కడే కూర్చుని కాలం వెళ్లబుచ్చాలని కుతూ

పాల పడ్డాడు రావు. కాని "ఒసేయ్ పిల్లవాడు ఏడుస్తుంటే వదలిపెట్టి అటుపోయి వాళ్ళ యింట్లో కూర్చున్నావటే" అన్న వాళ్ళమ్మ కేకలుపెట్టే సరికి సరస్వతి కాస్తా వెళ్ళిపోయింది.

సరస్వతి వెళ్ళేటప్పటికి రావుకి కడుపులో మండింది. పిల్లవాడు ఏడుస్తుంటే కూతురే ఎత్తుకోవాలేమిటి? తనెత్తుకో కూడదు? కూతురు కాలేజీకి వెళ్ళినప్పుడు పిల్లవాడేడిస్తే చచ్చినట్లు తనే ఎత్తుకోవటంలేదా ఏమిటి? అని మనసు రావుని నిలవేసింది. ఆ కోపంలో రావు వాళ్ళ తమ్ముడు పాఠం చెప్పమని అడిగినందుకు బావ మోదాడు.

"పోనివ్వు వదినా. పిల్లల గోల ఎప్పుడూ వుండేదేగదా? ఇవాళేం కొత్తకాదుగా. ఆయన చచ్చిపోయారట అందరూ చూచివస్తున్నారట. మనము వెళ్ళకపోతే బాగుండదు. కాస్త తల వెంట్రుకలు ముడిపెట్టుకో. ఇద్దరంవెళ్ళి చూచి వద్దాము"అని అంది అమ్మ. మీరు వెళ్ళేటప్పుడు నన్నుకూడా పిలవండీ అంది మా యింట్లో అద్దె కుంటున్న మరోకావిడ.

కొండయ్యగారి తుది దర్శనం చేసుకుంటానికని అమ్మ, నాయనమ్మ, యింకా యింట్లో తదితరులూ బయలుదేరబోతుండగా నాన్న యింట్లో అడుగు పెట్టారు.

అమ్మ నాన్నను చూడగానే "ఏమండీ ఆయనకు నీళ్ళుపోశారా? శవాన్ని వుంచారా తీసి కెళ్ళారా" అని అడిగింది.

నాన్నకు ఏమీ తోచక "ఎవరిశవమే?" అన్నారు.

"సరి పోయింది—మీరు కొండయ్యగారి యింటి దగ్గరనుంచి కదూ వస్తున్నది? ఆయన చచ్చిపోయారటగా" అని చెప్పింది అమ్మ. ఇప్పుడు మీరంతా ఎక్కడికి వెళ్ళుతున్నారు అన్న నాన్న ప్రశ్నకు జవాబుగా ఆయన్ను చూడటానికే అంది అమ్మ.

ఆ మాట వినేటప్పటికే నాన్నకు కోపం వచ్చింది. ఈ మాటలు ఎవరన్నా వింటే చెప్పుచ్చుకొని కొడతారు. ముందు నోరు మూసుకుని యింట్లోకి పదండి అని గద్దించారు నాన్న.

కుయ్ మనకుండా అంతా యింట్లోకి వచ్చారు. ఆయన చచ్చిపోయారని మీతో ఎవరు చెప్పారే' అని అమ్మను నాన్న కోపంగా అడిగారు.

"అదేంటండీ! నామీద విరుచుకు పడుతున్నారు? నాకు మటుకేం తెలుసు. మన చిన్నబ్బాయి చెవితే తెలిసింది. కావాలంటే వాడినే అడగండి. మీ ఎదురుగానే వున్నాడుగా" అంది వణుకుతూ అమ్మ.

అమ్మమాట పురస్కరించుకొని నాన్న అడగక ముందే తమ్ముడు "అవును నాన్నా! యిందాక వాళ్ళ యింటిముందునుంచి వస్తుంటే ఏడుపులు వినిపించినయ్. అంతా గాభరాగా అటునుంచి యిటు, యిటునుంచి అటు తిరుగుతున్నారు." అని జంకూ గొంకూ లేకుండా తను చూచింది చెప్పాడు తమ్ముడు.

"అవి ఏడుపులుగాదురు పిచ్చినాయనా! పాటలురా! పాటలు నీకు ఏడుపులుగా వినిపించిన వట్రా. దరిద్రుడా." అని నాన్న తమ్ముడిని కొట్టబోతుంటే అమ్మ అడ్డంబోయి అసలు సంగతేదో చెప్పండి అంది.

అమ్మ ఆ మాట అనగానే నాన్న నవ్వేరు. నాన్న ఎందుకు నవ్వుతున్నారో తెలియక అందరూ ఆశ్చర్యంగా నోరు తెరుచుకొని నించున్నారు. అసలు సంగతి చెప్పమన్నారు కదూ! చెబుతున్నాను వినండి అంటూ నాన్న నవ్వుతూ యిలా చెప్పేరు—

"కొండయ్యగారి నాల్గవ పిల్లను చూడడానికి యివాళ ఎవరో వచ్చారు. కొండయ్యగారి పిల్ల పాటలు పాడుతుందా మరి అందులో రకరకాలుగా గొంతుకు మార్చి ఎంతమందో పాడినట్లుగా కూడా పాడుతుందాయను ఈ సంగతి తెలిసి అమ్మాయిని చూస్తాని కొచ్చినవారు ఏదన్నా ఒక పాట పాడమని బలవంత పెట్టారు. మొదట పిల్ల సిగ్గుపడింది. తరువాత ఆ అమ్మాయి ఎవరైనా చచ్చిపోతే యింట్లో వాళ్ళు శవంమీదపడి ఎన్ని రకాలుగా ఏడుస్తారో అన్నిరకాలుగా పాడి వినిపించింది. ఆ అమ్మాయి ఆవిధంగా పాడుతున్న సమయంలో మన వెధవ అటునుంచి వచ్చివుంటాడు. అది విని మీకీవిధంగా చెప్పాడు. అంతే కాని కొండయ్యగారు చచ్చిపోలేదు. ఆయన మామూలుగా మంచంలోనే వున్నాడు" అనిచెప్పి ముగించారు.

★